
ప్రజాశక్తి
ఆదివారం 16 జూన్ 2024



'పురం' సబ్‌జైలు తనిఖీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఉపకారాగారాన్ని సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ శనివారం తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఖైదీలు తాము ఎలాంటి తప్పులూ చేయకపోయినా ఉద్దేశపూర్వకంగా కొందరు పోలీసులు తమను కేసులో ఇరికించారని న్యాయమూర్తి ఎదుట వాపోయారు. అనంతరం న్యాయమూర్తి శ్రీధర్ మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేస్తే జైలు పాలు కావాల్సి ఉంటుందన్నారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత కక్షల జోలికి వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని తెలియజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న ఖైదీలు న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేకపోతే తమ దష్టికి తీసుకువస్తే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, నాగరాజు రెడ్డి, వెంకటేష్, జైలు సూపరింటెండెంట్ అంజి నాయక్, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి పాల్గొన్నారు.



బడి బస్సు భద్రత ఎంత..?

◆ రోడ్డుపైకి ప్రయివేటు పాఠశాలల బస్సులు
◆ ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరి
◆ బస్సుల కండీషన్, డ్రైవర్ల లైసెన్సులు పరిశీలించాల్సిందే...

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. విద్యార్థులు పుస్తకాలు చేతబట్టి బడులకు వెళ్తున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివే పిల్లలు బస్సుల ద్వారా ఆయా పాటశాలలకు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ బడి బస్సుల భద్రత ఎంత అన్నదానిపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రయివేటు యాజమాన్యం నడిపే బస్సులు ఫిట్‌నెస్‌తో ఉన్నాయా.. లేదా అన్న సందేహాలు ఉన్నాయి. పిల్లలను తీసుకెళ్లే వాహనాలు కావడంతో వాటి భద్రతపై తల్లిదండ్రులు పరిశీలన చేసుకోవాల్సి ఉంది.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల రావడంతో విద్యావిధానం తీరు మారింది. విద్యా బోధన నుంచి, పాఠశాలకు పిల్లలు వెళ్లే వరకు అంతా ప్రయివేటు ఆధీనంలోకి వెళ్లింది. ముఖ్యంగా ప్రయివేటు పాఠశాలలు విద్యార్థులను చేరవేసేందుకు ప్రయివేటు బస్సులను ఉపయోగిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిత్యం ఇంటి నుంచి పాఠశాలలకు రాకపోకలు సాగించే బడి బస్సుల సామర్థ్యంపై తల్లిదండ్రులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు 1272 ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు 550 బస్సులు ఉంటాయి. వీటిలో ప్రతి రోజు వేలాది మంది విద్యార్థులు ఇంటి నుంచి పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యా సంస్థల యాజమాన్యాలు బస్సుల నిర్వహణపై జాగ్రత్తలు తీసుకుంటే విద్యార్థుల ప్రయాణం సురక్షితంగా ఉంటుంది. పాఠశాలల బస్సులకు సంబంధించి రవాణా శాఖకు ఫిట్‌నెస్ పత్రాలు సమర్పించి సామర్థ్య పరీక్షలు చేయించు కోవాల్సి ఉంది. అయితే చాలా వరకు యాజమాన్యాలు ఆదిశగా ఆసక్తి చూపుతున్న దాఖలాలు తక్కువగానే కన్పిస్తున్నాయి. విద్యార్థుల ప్రయాణ విషయంలో యాజమాన్యాలు అన్ని జాగ్రత్తలతో పత్రాలు సమకూర్చుకుని ఫిట్‌నెస్ చేయించుకుంటేనే బస్సులు రోడ్లపైకి రావాలని రవాణ శాఖ అధికారులు ఆదేశాలు ఇస్తున్నారు. మరి వీటిని ప్రయివేటు, కార్పొరేట్ యాజమాన్యాలు ఏ మేరకు అమలు చేస్తున్నాయన్న దానిపై సందేహాలు నెలకొన్నాయి.

నిబంధనలు ఇలా..

◆ పాఠశాల బస్సులకు సామర్థ పరీక్షలు చేయించుకునేందుకు వీలుగా రవాణా శాఖ కార్యాలయంలో అధికారులతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, బీమా, పొల్యూషన్ పత్రాలు, డ్రైవర్‌కు సంబంధించి లైసెన్స్ అందించి పరీక్షలు చేయించుకోవాలి.

◆ బస్సు కిటికీలకు ఇరువైపులా నాలుగు వరుసలా ఇనుప రక్షణ కంచెను ఏర్పాటు చేయాలి.

◆ బస్సులో ప్రథమ చికిత్స బాక్సులు అందుబాటులో ఉండాలి.

◆ బస్సు నడిపే డ్రైవర్ వయస్సు 60 ఏళ్ల లోపే ఉండాలి, డ్రైవర్‌కు ఐదేళ్ల హెవీ వాహనం నడిపిన అనుభవం ఉండాలి.



◆ డ్రైవర్‌తో పాటు విద్యార్థులు బస్సు ఎక్కినప్పుడు, దిగినప్పుడు చూసుకునేందుకు సహాయకుడు ఉండాలి. పిల్లలు బస్సుకు ఎక్కేందుకు వీలుగా అదనపు మెట్లు ఏర్పాటు చేయాలి.

◆ బస్సులో ఏదైని అగ్ని ప్రమాదం సంభవిస్తే మంటలు ఆర్పేందుకు వీలుగా అగ్ని ప్రమాద రక్షణ సిలిండర్ ఉండాలి.



అందరి సహకారంతోనే సమర్ధవంతంగా ఎన్నికల నిర్వహణ

ఎస్పీ మాధవరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లా పోలీస్ యంత్రాంగం, అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించడం వల్లే ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని ఎస్పీ ఎస్‌వి.మాధవ్ రెడ్డి తెలియజేశారు. శనివారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సెబ్ కమిషనర్ పంపిన ప్రశంసా పత్రాలను సెబ్ అధికారులతో పాటు సిబ్బందికి అందజేశారు. ఎన్నికల సెల్ పోలీస్ అధికారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి 60 మందికి ప్రశంసా పత్రాలు, రివార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల నియమావళికి అనుగుణంగా సమర్ధవంతంగా విధులు నిర్వహించారన్నారు. జిల్లా పోలీస్ శాఖ యంత్రాంగం సమిష్టిగా, నిబద్ధతతో విధులు నిర్వహించడం వల్లనే నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికలు, కౌంటింగ్ తదితర అన్ని పనులనూ విజయవంతంగా పూర్తి చేయగలిగామన్నారు. జిల్లాకు కర్నాటక సరిహద్దు ఉండడం వల్ల నిరంతరం గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది పూర్తి స్థాయిలో నిఘా ఉంచి విధులు నిర్వహించారని కొనియాడారు. ఎన్నికల సెల్ సిబ్బంది కూడా వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఎన్నికల కమిషన్‌కు ఎప్పటికప్పుడు సరైన సమయంలో సమాచారం ఇవ్వగలిగామన్నారు. ఎన్నికల సెల్ సిఐ విక్రమ్, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్‌లు ఈ విధులు పూర్తి స్థాయిలో నిర్వహించారన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు మొబైల్ యాప్ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఘటనలు చోటు చేసుకున్న వెంటనే మొబైల్ పార్టీ లు, ప్రత్యేక బలగాలతో ఘటనా స్థలానికి చేరుకునే అల్లర్లను నివారించగలిగారన్నారు. ఈ విధుల్లో జిల్లా అదనపు ఎస్పీ, అడ్మిన్, విష్ణు, సెబ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణం, ఈఎస్ సుబ్రహ్మణ్యంలు వారి విధులను బాగా నిర్వర్తించారన్నారు. అనంతరం సెబ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణం, ఈఎస్.సుబ్రహ్మణ్యం, ఎలక్షన్ సెల్ సిఐ విక్రమ్, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్ సీఐ,ఎస్ఐలు సిబ్బందికి ఎస్పీ ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.విష్ణు, సెబ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణం, ఈఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, సిఐ విక్రమ్, ఎస్ఐ ప్రదీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

సంపత్‌కుమార్ హత్యకేసు

ప్రధాన నిందితులను అరెస్టు చేయాలి

రాజకీయ పార్టీలు, విద్యార్థి ఐక్య వేదిక నాయకులు



రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇస్తున్న రాజకీయ, విద్యార్థి నేతలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన ఎస్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి, యువ న్యాయవాది సంపత్ కుమార్‌ను దారుణంగా హత్య చేయించిన ప్రధాన నిందితులను వెంటనే అరెస్టు చేసి, ప్రభుత్వం సంపత్ కుమార్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని రాజకీయ పార్టీలు, విద్యార్థి ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. సంపత్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. విద్యార్థి సంఘం నాయకుడు, యువ న్యాయవాది సంపత్‌కుమార్‌ను సుఫారీ ఇచ్చి దారుణంగా హత్య చేయించడం అత్యంత దారుణం అన్నారు. ప్రశాంతంగా ఉన్న హిందూపురం ప్రాంతంలో ఇలాంటి ఘటనలను ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. సంపత్ కుమార్‌ను దారుణంగా హత్య చేయించిన న్యాయవాది న్యాయవాది పట్టాను రద్దు చేసి, అతన్ని బార్ కౌన్సిల్ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. సంపత్ కుమార్ కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం ప్రభుత్వం ఇచ్చి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ఇవ్వని పక్షంలో హత్య చేయించిన న్యాయవాది ఆస్తులన్నింటినీ జప్తు చేసి అయినచేత నష్ట పరిహారం బాధిత కుటుంబానికి ఇప్పించాలన్నారు. అనంతరం రెవెన్యూ అధికారి గురుస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నాగార్జున, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్యామ్ కిరణ్, బీఎస్పీ శ్రీరాములు, ఆర్ఎస్‌పి ఎ.శ్రీనివాసులు, సిపిఎం నాయకులు ఎం.రమణ, ఎంఐఎం మున్నా, దళిత సమైక్య నాయకులు నారాయణ, కెవిపిఎస్ నాయకులు గోపాల్, రాయుడు, మూర్తి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-హిందూపురం

నందమూరి బాలకృష్ణ హిందూపురం శాసనసభ్యులుగా మూడవసారి గెలిచి హ్యాట్రిక్ సాధించిన సందర్భంగా ఎండిఎస్ బ్రదర్స్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ సారథ్యంలో హిందూపురం పట్టణంతోపాటు నియోజక వర్గం అన్ని విధాల అభివద్ధి చెందుతుందన్నారు. హ్యాట్రిక్ సాధించిన బాలకష్ణకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాబ్, హిదాయతుల్లా, ఇందాద్ పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎండిఎస్ బ్రదర్స్



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

సమన్వయంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దాం

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అధికారులందరి సహకారంతో పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని నూతన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే శనివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయని, ఇకపై నియోజకవర్గం అభివృద్ధికి సమన్వయంతో కలిసి కృషి చేద్దామన్నారు. సకాలంలో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని కోరారు. గతంలో చేపట్టిన గృహ నిర్మాణాల ప్రస్తుత పరిస్థితిపై నివేదికలు అందజేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు సమస్యలు ఏవైనా ఉంటే సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందన్నారు. రహదారుల మరమ్మతులు, కొత్త రహదారుల నిర్మాణంపై అధికారులు తగిన నివేదికలు అందజేస్తే నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలన్నారు. మున్సిపాలిటీతో పాటు మండలాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తేవాలన్నారు. అనంతరం శాఖల వారీగా ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించారు. సమావేశంలో ఆర్‌డిఒ భాగ్యరేఖ, డీఎస్పీ వాసుదేవన్, నియోజకవర్గంలోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రమణారెడ్డి

ప్రజాశక్తి-కదిరి టౌన్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమిష్టిగా కృషి చేద్దామని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రమణారెడ్డి పిలుపునిచ్చారు. పాన్ ఇండియా చైల్డ్ లేబర్ రెస్క్యు రిహాబిలిటేషన్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం కార్మిక, పోలీస్ శాఖలు, రెడ్స్ సంస్థ, డిసిపియు యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో బాల కార్మికుల రెస్క్యూ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో హిందూపురం ఎఎల్ఒ శేఖర్‌బాబు, రెడ్స్ డైరెక్టర్ భానుజా, కదిరి ఎంఇఒ చెన్నకృష్ణ, కదిరి ఎఎల్ఒ జహిరుద్దీన్, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొని మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో బాల కార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కూడా చేపట్టామన్నారు. రెడ్స్ డైరెక్టర్ భానుజా మాట్లాడుతూ కదిరి ప్రాంతంలో ప్రభుత్వ శాఖలతో కలిసి రెండేళ్లుగా రెస్క్యు చేస్తున్నామని, గత ఏప్రిల్ 8వ తేదీ కదిరి పట్టణంలో రెస్క్యు చేయగా అదే యజమానుల వద్ద అదే పిల్లలు పని చేస్తుండడం బాధాకరం అన్నారు. ఈ విషయంపై బాలల తల్లిదండ్రులు, యజమానులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాలలతో ప్రమాదకర ప్రదేశాల్లో పనులు చేయిస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే తక్కువ వేతనం ఇస్తూ పిల్లలతో పని చేయించుకుంటున్నారన్నారు. అన్ని శాఖలు కలిసి పని చేయడం వల్లే బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రెడ్స్ సిబ్బంది వైఎ.అనిత, రవీంద్ర, ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.



బాల కార్మికులను గుర్తిస్తున్న అధికారులు



తండ్రి మృతదేహం వద్ద రోదిస్తున్న కుమార్తె

వారం వ్యవధిలో తల్లిదండ్రుల మరణం

అనాథగా మారిన కూతురు

ప్రజాశక్తి-రొద్దం

వారం రోజుల వ్యవధిలో తల్లిదండ్రులు ఇద్దరూ మరణించారు. ఈ ఘటనతో వారి ఒక్కగానొక్క కుమార్తె అనాథగా మారింది. తల్లిదండ్రుల చాటున ఎంతో గారాభంగా పెరిగిన కుమార్తెకు జీవితం ఒక్కసారిగా అంధకారంలో పడింది. నా అన్న వారు ఎవరూ లేక పుట్టెడు దుఖంలో ఆమె జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. రొద్దం మండల పరిధిలోని సానిపల్లి గ్రామానికి చెందిన రామాంజినేయులు(60) అనారోగ్యంతో శుక్రవారం నాడు మరణించాడు. గత వారం రోజుల క్రితం ఈయన భార్య కూడా అనారోగ్యంతో మరణించారు. వీరికి ఒక్కగానొక్క కుమార్తె 17 సంవత్సరాల భార్గవి ఉంది. ప్రస్తుతం ఆమె ఇంటర్ చదువుతోంది. గతేడాది ఇంటర్ బైపీసీలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. ప్రస్తుతం తల్లిదండ్రులు ఇద్దరూ మరణించడంతో యువతి ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో పడింది. మరణించిన తండ్రి మృతదేహం వద్ద కన్నీటి పర్యవంతం అయ్యింది. అనాథగా మారిన యువతిని ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆమె ఉన్నత చదువుకు సహకరించేలా చూడాలని కోరారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే,మాజీ మంత్రి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి నియోజకవర్గం నూతన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని శనివారం ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా ఎస్పీతో పల్లె సింధూర, రఘునాథ్ రెడ్డిలు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు శాంతియుతంగా జరగడానికి సహకరించిన పోలీసులు, అధికారులకు కతజ్ఞతలు తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసులు గట్టి భద్రత ఏర్పాట్లను నిర్వహించారన్నారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులు సహకారం ఎంతో అవసరమన్నారు. నియోజకవర్గ అభివద్ధి విషయంలో సహకరించాలని ఎస్పీని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ పల్లె సింధూర రెడ్డిని అభినందించారు. పుట్టపర్తి నియోజకవర్గం లో మొదటి మహిళ ఎమ్మెల్యే అభ్యర్థిగా, గెలుపొందినందుకు ఆమెకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేని కలిసిన ఆర్డీవో

పుట్టపర్తి నియోజకవర్గ కేంద్రానికి విచ్చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని జిల్లా ఉన్నతాధికారులు పలువురు శనివారం తన కార్యాలయంలో మర్యాదపూర్వక కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో భాగ్యరేఖ, తహశీల్దార్ వేణుగోపాల్, రెవెన్యూ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ అధికారుల సమన్వయంతో పుట్టపర్తి నియోజకవర్గ అభివద్ధికి అందరూ సహకరించాలని కోరారు.



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న పల్లె సింధూరరెడ్డి, పల్లె రఘునాథరెడ్డి

ప్రశాంతంగా బక్రీద్‌ను జరుపుకుందాం : డీఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ వ్యాప్తంగా సోమవారం జరిగే బక్రీద్ పండుగను అందరూ శాంతి యుతంగా జరుపుకోవాలని డీఎస్పీ కంజాక్షన్ సూచించారు. శనివారం నాడు డీఎస్పీ కార్యాలయంలో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముస్లీం మత పెద్దలతో పాటు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, టూటౌన్ సిఐలు పాల్గొన్నారు. బక్రదీద్ సందర్భంగా నిబందనలు ఎవరు అతిక్రమించినా వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలియజేశారు. ఈ సమావేశంలో జామీయ మసీదు ముతవల్లీ నూరూల్లాతో పాటు కమిటీ మెంబర్లు, వివిధ మసీదుల ముతవల్లీలు, అధికారులు పాల్గొన్నారు.



శాంతి సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కంజాక్షన్

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం : మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

బక్రీద్ పండుగను పురష్కరించుకుని ఖుర్బానీ ఇచ్చే వారు తప్పకుండా నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ముస్లీం మత పెద్దలకు సూచించారు. 14 సంవత్సరాల లోపు గోవులు, ఎద్దు, దున్న, గేద తదితర జంతువులను వధించడం నేరం అన్నారు. జంతువులను వదించే సమయంలో తప్పని సరిగా పశు వైద్యుల ధ్రువీకరణ ఉండాలన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యం ముఖ్యం



సమావేశంలో మాట్లాడుతున్న డా॥హరీష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని మెడికల్ ఆఫీసర్ డా॥హరీష్ కుమార్ తెలియజేశారు. శనివారం మండల పరిధిలోని కిరికెర వద్ద ఉన్న ఎల్ఆర్‌జి పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థుల నాయకత్వ ప్రమాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా పాల్గొన్న డా॥హరీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ఎంత దృష్టి సారిస్తారో అదే విధంగా ఆరోగ్యంపైన శ్రద్ధ తీసుకోవాలన్నారు. జంక్ ఆహార పధర్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ విద్యార్థుల చదువు ఒక్కటే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ బాలసుందరం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్

'ఉపాధి' కూలీలకు పనిముట్లు ఇవ్వాలి

వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని చాగలేరు పంచాయతీ పరిధిలోని నంజిరెడ్డిపల్లి, పెద్దరెడ్డిపల్లి గ్రామాల్లో జరుగు తున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా వంద రోజులు పూర్తి చేసిన కూలీలకు నాలుగేళ్లుగా పనిముట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నార న్నారు. 4 వారాల నుంచి బిల్లులు మంజూరు చేయకపోవడంతో కూలీలు నానా ఇబ్బందులు పడుతు న్నారన్నారు. రోజూ వాహనాల్లో 4 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి పని ప్రదేశానికి చేరుకుంటు న్నారని, అయితే కూలీలకు రవాణా ఖర్చులు ఇవ్వకుండా కోత విధిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే కూలీలకు ఇవాల్సిన పనిముట్లు, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూలీలు నాగభూషణ, వేణుగోపాల్‌రెడ్డి, పద్మావతి, శ్రీనివాసులు, గోపాల్, వెంకటేష్, బయన్న, తదితరులు పాల్గొన్నారు.

రక్షా అకాడమీలో రక్తదాన శిబిరం

చిలమత్తూరు : లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో శనివారం కొడికొండ చెక్‌పోస్ట్‌లోని రక్షా అకాడమీలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో మండల వైద్యులు రామక్రిష్ణ సహకారంతో యువకులు 50 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. శిబిరంలో రక్షా అకాడమీ కల్నల్ కిరిత్‌నాయర్, కమాండర్ నవీన్ త్యాగి, నాగేశ్వర్‌రెడ్డి, చైల్డ్ ఫండ్ ఇండియా రమేష్ యాదవ్, వెంకట్, నందకుమార్, సాహీరబాను, హరి తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

ముస్లిం పెద్దలతో ఎస్ఐ సమావేశం

నల్లచెరువు : బక్రీద్ పండుగ నేపథ్యంలో శనివారం ఎస్ఐ కెఎం లింగన్న ముస్లిం మత పెద్దలతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ రవికుమార్ సమక్షంలో నిర్వహించిన సమావేశానికి మండల కేంద్రమైన నల్లచెరువుతో పాటు అల్లుగుండు, కె.పూలకుంట గ్రామాలకు చెందిన ముస్లిం మత పెద్దలు హాజరయ్యారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో గోవధ చేయరాదని, ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మహబూబ్, మత పెద్దలు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

కొత్తచెరువు రూరల్ : కొత్తచెరువు సమీపంలో గుడారాల్లో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబాల పిల్లలకు శనివారం కిత్ మత్ ఏ ఖల్గో ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఛైర్మన్ నూతన దుస్తులు పంపిణీ చేశారు. పుట్టపర్తికి చెందిన సాయి బాలాజీ జువెల్లరీ యజమాని నాగభూషణాచారి ఆర్థిక సహాయంతో కొత్తచెరువు నుంచి నాగిరెడ్డిపల్లికి వెళ్లే రహదారి పక్కన ఉన్న గుడారాల్లో నివాసం ఉంటున్న 50 కుటుంబాల వారికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చాంద్, జావిద్, సోహెల్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



నిరుపేద పిల్లలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని శిల్పారామంలో శనివారం ఆ కమిటీ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కమిటీ సభ్యులు విస్తృతంగా పర్యటించడానికి ప్రభుత్వం ఆర్టీసీ పాసులు మంజూరు చేయాలని, సభ్యులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు గ్రామాల్లో ప్రత్యేక శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని, సివిల్ రైట్స్‌కు సంబంధించి నెలకోసారి గ్రామాల్లో పర్యటించి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అసైన్మెంట్ కమిటీలో కూడా తమ కమిటీ సభ్యులకు అవకాశం కల్పించాలని కోరారు. కమిటీ సభ్యులు ఆయా గ్రామాల్లో గుర్తించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో కమిటీ నాయకులు మూర్తి, గంగులయ్య, పైపల్లి గంగాధర్, సురేష్, రామాంజనేయులు, పవిత్ర, నాగేంద్ర, బాషా, తదితరులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, టిడిపి నాయకులు

త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభం

మడకశిర : పేదల ఆకలి తీర్చడానికి గతంలో టిడిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్న క్యాంటీన్‌ను పట్టణంలో త్వరలో ప్రారంభిస్తామని టిడిపి పట్టణ కన్వీనర్ మనోహర్ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో 15 రోజుల్లో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి చేత అన్నక్యాంటీన్‌ను పునః ప్రారంభిస్తామని తెలిపారు. ఇప్పటికే అన్న క్యాంటీన్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను టిడిపి నాయకులు అధికారులతో కలిసి పరిశీలించారు. పరిశీలించిన వారిలో మనోహర్‌తో పాటు భక్తర్, కౌన్సిలర్లు ఉమాశంకర్, రాజా, శ్రీనివాసులు, హనుమంతు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు తిమ్మరాజు, రామాంజనేయులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మోకాలి నడకన తిరుమల మెట్లెక్కిన ఎంపిటిసి

ఓబుళదేవరచెరువు : 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం సాధించి అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం, పుట్టపర్తి ఎమ్మెల్యేగా పల్లె సింధూరరెడ్డి గెలవడంతో ఎంపీటీసీ శ్రీనివాసులు శనివారం మెట్ల మార్గంలో మోకాలి నడకన తిరుమలకు చేరుకుని మొక్కుబడి చెల్లించాడు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మొక్కుకున్న మేరకు మెట్ల మార్గంలో మోకాలి నడకన తిరుమలకు చేరుకుని శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నానని తెలిపారు. ఆయనతో పాటు శీను, వెంకటరామిరెడ్డి, కొట్టాల అంజన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



మోకాలి నడకన తిరుమల మెట్లెక్కుతున్న ఎంపిటిసి శ్రీనివాసులు

పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించండి : డీఈవో

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని డీఈఓ మీనాక్షి సూచించారు. ఎస్‌పిడి ఆదేశాల మేరకు 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా శనివారం కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులతో కలిసి స్థానిక నాలుగు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పాడ్డారు. డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైనందున బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి జులై 12వ తేదీ వరకూ స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. జిల్లావ్యాప్తంగా అధికారులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫారం, మధ్యాహ్నం భోజనం అందజేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన సదుపాయాలు ఉన్నాయని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ర్యాలీలో ఎంఈఓ జయచంద్ర, జిల్లా సమగ్ర శిక్ష అలెస్కో ఆనంద్‌బాబు, హెచ్‌ఎంలు వాణిబాయి, ఉపాధ్యాయులు, సిఆర్‌ఎంటిలు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

ఫ్లోరోసిస్ బాధితులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-చిలమత్తూరు

జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ తేజస్విని ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్ బాధితులకు పునరావాస పరికరాలు (కిట్లు) పంపిణీ చేశారు. ముందుగా మండల వ్యాప్తంగా ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాల్లో సర్వే నిర్వహించారు. పాఠశాలలు, ఇంటింటికీ వెళ్లి ఫ్లోరోసిస్ అనుమానాస్పద కేసులను గుర్తించి వారి మూత్ర, రక్త శాంపిల్స్ సేకరించి జిల్లా కేంద్రానికి పంపించి బాధితులను నిర్ధారించారు. అవసరమైన వారికి నడుము, మెడకు బెల్టులు, వాకర్లు అందజేశారు. వీరికి భవిష్యత్తులో శస్త్రచికిత్స కూడా చేయిస్తామన్నారు. తాగునీటిలో ఫ్లోరైడ్ శాతాన్ని పరీక్షించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఉచితంగా శుద్ధిచేసిన తాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఫ్లోరైడ్ బాధితులు ఎలాంటి ఆహారం తీసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ అధికారి ఆంజనేయులు, సూపర్వైజర్లు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఫ్లోరోసిస్ బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని గుమ్మయగారిపల్లి, బూదిలి, పాపిరెడ్డిపల్లి, బూచేపల్లి గ్రామాలకు చెందిన నిరుపేదలు ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వీరికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు ఆంజనేయులు, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ అధ్యక్షులు అంజనాదేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు నిరుపేదలతో కలిసి తహశీల్దార్ అక్బర్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. అంజనాదేవి మాట్లాడుతూ పేదలు ఇల్లు, ఇళ్ల స్థలాలు లేక అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలతో పాటు ఇంటి అద్దెలు పెరగడం, ఉపాధి లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారన్నారు. విధి లేని పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో నిరుపేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకోగా రెవెన్యూ అధికారులు వాటిని తొలగించి నష్టం కలిగించారన్నారు. ఇకనైనా అధికారులు పేదల ఇబ్బందులను గుర్తించి న్యాయబద్ధంగా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు నంజుండప్ప, ఆంజనేయులు, ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుపేదలు పాల్గొన్నారు.



తహశీల్దార్ అక్బర్‌బాషాకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై న్యాయవాదుల హర్షం

సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం పట్ల పుట్టపర్తి బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం న్యాయవాదులు సమావేశమయ్యారు. న్యాయవాదులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రైతాంగం, ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకురాగా, అప్పుడే అన్ని వర్గాల ప్రజలు ఆ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారన్నారు. దీనిపై టిడిపి అధినేత చంద్రబాబు స్పందించి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లోపభూయిష్టంగా ఉందని, తాము అధికారంలోకి వచ్చిన తక్షణమే రద్దు చేస్తామని ఎన్నికల ప్రచార సభల్లో స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. ఆ మేరకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు ఫైలుపై సంతకం చేశారన్నారు. ఈ నిర్ణయం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. థాంక్స్ సిఎం చంద్రబాబు అంటూ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు న్యాయవాదుల సంక్షేమానికి పెద్దపీట వేస్తారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు లెక్కల యదుభూషణ్, లెక్కల కృష్ణప్రసాద్, కృష్ణమూర్తి, నాగేంద్ర, జానకంపల్లి శ్రీనివాసులు, నాగార్జున, ధర్మవరం శ్రీనివాసులు ప్రకటించారు.



సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

అరాచకాల వల్లే వైసిపి కనుమరుగు

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

గత ఐదేళ్లలో చేసిన అరాచకాలు, అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాల వల్లే రాష్ట్రంలో వైసిపి కనుమరుగైందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేసిన ప్రజావ్యతిరేక పాలన వల్ల ప్రజలు విసిగిపోయి ఓటు ద్వారా గట్టిగా బుద్ధి చెప్పి కూటమికి అఖండ మెజారిటీ ఇచ్చార న్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి సమన్వయం చేసుకుని కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామన్నారు. నేను ఏమి చేశానని ప్రజలు నన్ను ఓడించారని కేతిరెడ్డి పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. త్వరలో వైసిపి పూర్తిగా కనుమరుగవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం మరో 20 ఏళ్లు అధికారంలో ఉంటుందన్నారు. సత్యకుమార్ అతి తక్కువ సమయంలోనే ధర్మవరం ప్రజలకు దగ్గరయ్యాని, ప్రజలు కూడా ఆయనను నమ్మి ఓట్లు వేసి గెలిపించారన్నారు. సత్యకుమార్‌కు మంత్రి పదవి దక్కడం పట్ల శుభాకాంక్షలు తెలి పారు. సమావేశంలో నాయకులు బెస్త శ్రీనివాసులు, అడ్డగిరి శ్యాంకుమార్, వెంకటరెడ్డి, బాలక్రిష్ణ, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం

వేరుశనగ పంట యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పుట్టపర్తి ఏరువాక, కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులు, వ్యవసాయ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వేరుశనగ పంటల యాజమాన్యం, వేరుశనగ విత్తనోత్పత్తిపై క్లుప్తంగా వివరించారు. శాస్త్రవేత్తలు రైతుల సమస్యలు విని వాటి పరిష్కారానికి సూచనలు చేశారు. కొన్ని సమస్యలపై అక్కడే చర్చించి నివృత్తి చేశారు. పుట్టపర్తిలో ఉన్న ఏరువాక కేంద్రం సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జాన్సన్ రామసుబ్బయ్య, కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త వెంకటరమణ, నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ఏరియా మేనేజర్ కేశవమూర్తి, జిల్లా వనరుల కేంద్రం డిడిఎ విద్యావతి, ఎఓ వెంకట బ్రహ్మం, ఎఇఒ ఆనంద్‌నాయక్ పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోండి

సిఐ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

బక్రీద్ పండుగను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం సూచిం చారు. సిఐ శనివారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హిందూ, ముస్లింల పెద్దలతో శాంతి కమిటీ సమా వేశం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ ధర్మవరం ప్రశాంతతకు మారుపేరని, బక్రీద్ పండుగను కూడా అదేరీతిలో జరుపుకోవలన్నారు. ముస్లింలకు అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ధర్మవరంలో ముస్లింలు ఈద్గా మైదానికి వెళ్లేటప్పుడు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామ న్నారు. సమావేశంలో ముస్లింలు నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, అత్తార్ రహీంబాషా, చాంద్‌బాషా, ఖలీల్ రెహ్మాన్, కుళ్లాయప్ప, హిందువులు సాకే ఓబులేశు, జింకా చంద్రశేఖర్, గుండా పుల్లయ్య, చంద్రమౌళి, బిల్లే రవి, తదితరులు పాల్గొన్నారు.

అభిమాని మృతికి నివాళి

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని పెనుకొండ పావగడ ప్రధాన రహదారిలో మారెమ్మ దేవాలయం సమీపంలో ఉన్న తెలుగుదేశం పార్టీ విరాభిమాని ఆటో డ్రైవర్ నీలంపల్లి అగ్గిరాము(43) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మతి చెందాడు. విషయం తెలుసుకున్న మండల టిడిపి నాయకులు వారి ఇంటి వద్దకు చేరుకుని మత దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాధవ నాయుడు, వీరాంజ, హరీష్, చంద్ర శేఖర్, క్రిష్టప్ప, సురేష్, రుద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మొదటిసారిగా పుట్టపర్తికి వచ్చిన సందర్భంగా టిడిపి నాయకులు, అధికారులు ఆమెకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపేందుకు ఎగబడ్డారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం అధికారులు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, శాలువాలతో ఆమెను సన్మానించి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలపడానికి ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ బారులు తీరారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి భారీగా టిడిపి శ్రేణులు తరలివచ్చారు. ఎమ్మెల్యే సింధూరరెడ్డితో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి అభినందనల వెల్లువ కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వైబి.భాస్కర్ రెడ్డి, పుట్టపర్తి తాలూకా అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి, నిరంజన్‌రెడ్డి, చంద్రకళ, చంద్రనాయక్, తదితరులు ఎమ్మెల్యేకి అభినందనలు తెలిపి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సన్మానించారు. తమ సంఘం తరపున అన్ని విధాలా సహకరిస్తామని వారు ఎమ్మెల్యేకి హామీ ఇచ్చారు.

నేడు 'కందికుంట' ఆత్మీయ సమావేశం

కదిరి టౌన్ : 2024 సార్వత్రిక ఎన్నికల్లో కదిరి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్ విజయఢంకా మోగించ డంతో ఆదివారం పట్టణంలోని మదనపల్లి రోడ్డులో ఉన్న పివిఆర్ ఫంక్షన్ హాలులో కందికుంట ఆధ్వర్యంలో ఎన్డీఎ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఆత్మీయ సమావేశం నిర్వహి స్తున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను వివరిస్తారన్నారు. ఆత్మీయ సమావేశం కోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నట్లు తెలిపారు.

జయప్రదం చేయండి

నల్లచెరువు : కదిరి పట్టణంలోని మదనపల్లి రోడ్డులో ఉన్న పివిఆర్ ఫంక్షన్ హాలులో ఈ నెల 16వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్ తెలిపారు. కదిరి నియోజకవర్గ పరిధిలోని టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతిఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఆత్మీయ సమావేశం ముగిసాక మధ్యాహం విందు భోజనం ఏర్పాటు చేస్తారని తెలిపారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమకోన్నత, ఉన్నత పాఠశాలకు శనివారం పాఠ్యపుస్తకలు పంపిణీ చేసినట్లు ఎంఇఒ-1 బి.కృష్ణానాయక్, శ్రీనివాసులు-2 తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలోని 6 జిల్లా పరిషత్, 4 యుపి, 49 ప్రాథమిక పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశామన్నారు. మండలానికి దాదాపు 18,310 పాఠ్యపుస్తకాలు రాగా అందులో 14,943 నోట్ పుస్తకాలు వచ్చాయని, 82 శాతం పంపిణీ చేశామని తెలిపారు. రెండో విడత వచ్చిన వెంటనే పాఠశాలలకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



గాండ్లపెంట : చిన్నారులతో 'అంగన్వాడీ పిలుస్తోంది' ర్యాలీ చేపట్టిన ఐసిడిఎస్ అధికారిణులు

'అంగన్వాడీ పిలుస్తోంది'

గాండ్లపెంట : 'అంగన్వాడీ పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మల్లమీదపల్లి, కోటూరు, సోమయాజులపల్లి, తదితర గ్రామాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో అందే సేవలపై తల్లులకు అవగాహన కల్పించారు. అలాగే బాల్యవివాహాలను అరికట్టాలని సూచించారు. మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, తద్వారా వారికి ఆట పాట, మాట, కథ, సృజనాత్మకత, సిద్ధాంతాలతో కూడిన ప్రాథమిక విద్య అందుతుందన్నారు. అలాగే శరీరకంగా, మానసికంగా కూడా అభివృద్ధి చెందుతారన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులతో పాటు గర్భిణులకు పోషకాహారం ఇస్తామన్నారు. ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలన్నారు. 6 నెలల పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మీదేవి, ఈశ్వరమ్మ, అంజనమ్మ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలంలోని కంచిసముద్రం సెక్టార్ పరిధిలోని తిలక్‌నగర్‌లో శనివారం 'అంగన్వాడీ పిలు స్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, 0-6 ఏళ్ల లోపు పిల్లల తల్లులను సమావేశపరిచి వారికి పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ ద్వారా పిల్లల శారీరక, మానసిక, సాంఘిక, మేధాశక్తి అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 'అంగన్వాడీ ముద్దు- కాన్వెంట్ వద్దు', 'అంగన్వాడీ విద్య-ఆటపాటల విద్య' నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయమ్మ, అంగన్వాడీ కార్యకర్త వసుంధర, పిల్లలు తల్లులు పాల్గొన్నారు.

టిడిపి అభిమాని అన్నదానం


మడకశిర : రాష్ట్రంలో నూతన ముఖ్యమంత్రిగా టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడం, ఎమ్మెల్యేగా ఎంఎస్ రాజు గెలుపొందిన సందర్భంగా శనివారం పట్టణంలోని పావగడ రోడ్డులో టిడిపి అభిమాని ఈశ్వర్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మనోహర్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు భక్తర్, కౌన్సిలర్లు ఉమాశంకర్, రాజా, శ్రీనివాసులు, హనుమంతు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు తిమ్మరాజు, మాజీ కౌన్సిలర్ నాగరాజు, బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షులు జుంజప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న టిడిపి నాయకులు

లేపాక్షి ఆలయ హుండీ లెక్కింపు

లేపాక్షి : మండలంలో ప్రసిద్ధి చెందిన శ్రీదుర్గావీరభద్రస్వామి ఆలయంలో శనివారం ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ అధ్యక్షతన, ఈఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించారు. అందులో రూ. 4,47,370 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, సిబ్బంది, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



హుండీలోని నగదును లెక్కిస్తున్న సిబ్బంది